సోమవారం 01-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 381, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



ఒక్కరోజే దొరికిన 262 మంది మందుబాబులు

వివరాలు 2లో



బాల్య స్నేహితులిద్దరూ దేశ అత్యున్నత అధికారులు

వివరాలు 3లో



భారత్‌లో చదువు కంటే పెళ్లిళ్లకే ఖర్చు ఎక్కువ

వివరాలు 3లో



బాలికకు భరోసా కావాలి

వివరాలు 4లో

# ఇకపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

- దేశంలో నేటి నుంచి కొత్త చట్టాలు..!
- బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు ముగింపు
- మైనర్లపై అత్యాచారం కేసులో కఠిన శిక్షలు

ముందడుగు జాతీయం: దేశంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త చట్టాలు నేటి నుంచి అమలులోకి రానున్నాయి. న్యాయ వ్యవస్థలో విస్తృతమైన మార్పులు తీసుకువచ్చేలా క్రిమినల్ చట్టాలను రూపొందించారు. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం, నాగరిక్ సురక్ష సంహిత అమలు కానున్నాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు ముగింపు పలుకుతూ న్యాయ వ్యవస్థలో కీలక మార్పులను తీసుకురావడానికి మోడీ ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించింది.

ఈ చట్టాల వల్ల జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మోడ్‌ల ద్వారా సమన్లు జారీ చేయడం, క్రూరమైన నేరాలకు సంబంధించిన నేర దృశ్యాలు తప్పనిసరిగా వంటి నిబంధనలు అమలులోకి రానున్నాయి. భారతీయ న్యాయ సంహితలో రాజద్రోహం స్థానంలో దేశ ద్రోహం అనే కొత్త పదాన్ని చేర్చారు. రాజ్యాంగ ఆదర్శాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సమాజంలో నేరాలను త్వరగా పరిష్కరించేందుకు ఈ మార్పులు



దోహదం చేస్తాయని కేంద్ర అధికారిక వర్గాలు వెల్లడించాయి.

### శిక్షల కంటే న్యాయం కోసమే..

కొత్త చట్టాలు పౌరులకు శిక్షలు విధించడం కంటే న్యాయం అందించడానికే ప్రాధాన్యం ఇస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. వలసవాద నేర న్యాయ చట్టాల ముగింపుతో పాటు, అందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో సవరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. చట్టాలు కేవలం పేరు మార్పుకే కారణం కాదని, చట్టాల్లో పూర్తి సవరణలు తీసుకువచ్చామని అన్నారు. ఈ నూతన చట్టం భారతీయులే రూపొందించారన్న అమిష్ షా కొత్త ఆర్థిక చట్టాలు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయన్ని నిర్థారిస్తాయని అన్నారు.

### చట్టాల్లోని కొన్ని ప్రత్యేకతలు

కొత్త చట్టాల ప్రకారం క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లో తీర్పు ఇవ్వాలి. మొదటి విచారణ నుంచి 60 రోజులలోపే అభియోగాలు నమోదు చేయాలి. అత్యాచార బాధితుల వాంగ్మూలాన్ని సంరక్షకుల సమక్షంలో మహిళా పోలీసు అధికారి నమోదు చేయాలి. అత్యాచార బాధితుల నివేదికలు 7 రోజుల్లోనే రావాలి. పిల్లలను కొనడం, అమ్మడం తీవ్రమైన చర్యగా పరిగణిస్తారు. మైనర్ పై సామూహిక అత్యాచారం కేసులో జీవిత ఖైదు లేదా మరణశిక్ష విధిస్తారు. అంతే కాకుండా సాక్షుల వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్ష్యాలను జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన డీజీ లాకర్‌లో భద్రపరుస్తారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి తప్పుడు వాగ్దానాలతో సంబంధాలు పెట్టుకునే వారిపై కూడా కొత్త చట్టాల్లో కఠిన శిక్షలు ఉన్నాయి.

# తల్లిని గౌరవించేలా మొక్కను నాటండి

- మా అమ్మ పేరుతో నేను మొక్క నాటాను
- మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోడీ

ముందడుగు ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి నెలా చివరి ఆదివారం ఏర్పాటు చేసే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని పునః ప్రారంభించారు. వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన దేశ ప్రజలను మిగతా 2లో



# ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష నిర్వహణ..!

## సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న కేంద్రం




ముందడుగు జాతీయం: దేశంలో నీట్-యూజీ పరీక్షకు సంబంధించిన పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కొత్త ఆలోచన చేస్తున్నది. నీట్ పరీక్షను మిగతా 2లో

ముందడుగు
సోమవారం,
01-7-2024,
హైదరాబాద్

## తల్లిని గౌరవించేలా మొక్కను నాటండి

మొదటిపేజీ తరువాయి

ఉద్దేశించి రేడియో ప్రసంగం చేశారు. మరోసారి ఎన్డీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినందుకు దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో కొత్త ప్రచారానికి పిలుపునిచ్చారు.

2024 సార్వత్రిక ఎన్నికలు ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికలుగా మోడీ పేర్కొన్నారు. ఏ దేశంలోనూ ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదని, 65 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటు వేశారని అన్నారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని తిరిగి ఎంచుకున్నందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియపై తనకున్న విశ్వాసాన్ని ప్రజలు నిలబెట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా "ఏక్ పేడ్ మా కే నామ్" పేరుతో తీసుకొచ్చిన కొత్త ప్రచారం గురించి ప్రస్తావించారు. "మా అమ్మ పేరుతో నేను మొక్క నాటాను. ప్రతి ఒక్కరూ తమ తల్లులను గౌరవించేలా ఒక మొక్కను నాటండి " అని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే నెలలో జరగనున్న ఒలింపిక్స్‌లో పాల్గొననున్న భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేస్తారని దేశం ఆశిస్తోందన్నారు. వారిని ప్రోత్సహించేందుకు "చీర్4భారత్" హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగించాలని కోరారు.

## ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష నిర్వహణ..!

మొదటిపేజీ తరువాయి

పెన్, పేపర్ పద్ధతిలో ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహణకుగల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కేంద్రం ఆన్‌లైన్ నీట్ నిర్వహణ కోసం చేస్తున్న యోచన గురించి ఓ జాతీయ మీడియా సంస్థ వెల్లడించింది.

ప్రస్తుతం నీట్ పరీక్ష పెన్, పేపర్ విధానంలో జరుగుతున్నది. ఈ విధానంలో అభ్యర్థులు ఓఎమ్మార్ షీట్‌లో తమ సమాధానాలను మార్క్ చేయాల్సి ఉంటుంది. అయితే నీట్‌లో అక్రమాలను అరికట్టేందుకు ఇకపై ఆన్‌లైన్ విధానమే సరైనదని కేంద్రం యోచిస్తోందని, దీనిపై చర్చించేందుకు కేంద్రం గత వారం కనీసం మూడు ఉన్నతస్థాయి సమావేశాలను ఏర్పాటు చేసిందని ఆ మీడియా కథనం పేర్కొంది.

## డీఎస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

### డీఎస్ భౌతికకాయానికి రేవంత్ రెడ్డి నివాళులు




ముందడుగు నిజామాబాద్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని.. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో డీఎస్ భౌతికకాయం వద్ద ఆయన నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. "డీఎస్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు. 2004, 2009లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పీసీసీ అధ్యక్షుడిగా ఆయన ఎంతో కృషి చేశారు. విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. కొంతకాలం పార్టీకి దూరమైనా పార్లమెంట్‌లో డీఎస్‌ను సోనియాగాంధీ ఆప్యాయంగా పలకరించేవారు. పదవులపై ఎప్పుడూ ఆశలేదని ఆయన చెప్పేవారు. చనిపోయినప్పుడు కాంగ్రెస్ జెండా కప్పాలనేది డీఎస్ కోరిక. అందుకే ముఖ్యనాయకులను పంపి ఆ కోరిక తీర్చాం. కుటుంబసభ్యులతో చర్చించి డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం" అని రేవంత్ తెలిపారు.



## బాల్య స్నేహితులిద్దరూ దేశ అత్యున్నత అధికారులు

### ఒకరేమో నేవీ అధిపతి, మరొకరేమో ఆర్మీ చీఫ్

ముందడుగు జాతీయం


ఇద్దరు చిన్నప్పటి నుంచి కలిసి పెరిగి, కలిసి చదువుకున్న బాల్య స్నేహితులు.. ఇప్పుడు ఆ ఇద్దరూ బాల్య స్నేహితులే దేశ రక్షణదళాల అత్యున్నత కమాండర్లుగా మారారు. వీరు మరెవరో కాదు దేశంలోని ఆర్మీ, నేవీ అధిపతులు. అడ్మిరల్ దినేష్ త్రిపాఠి భారత నౌకాదళ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు.

దినేష్ త్రిపాఠి, ఉపేంద్ర ద్వివేది 1970లో మధ్యప్రదేశ్ రేవాలోని సైనిక్ స్కూల్‌లో కలిసి చదువుకున్నారు. నాటి నుంచే వారిద్దరి మధ్య బలమైన స్నేహబంధం ఉంది. ప్రస్తుతం వారు వేర్వేరు దళాలకు నాయకత్వం వహిస్తున్నప్పటికీ పరస్పరం సలహా సంప్రదింపులు జరుపుతుంటారు. రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి భరత్ భూషణ్ బాబు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని పోస్ట్ చేస్తూ.. "ఇద్దరు అద్భుతమైన విద్యార్థులను మిలటరీలో అత్యున్నత సేవలు అందించగలిగే అధికారులుగా తీర్చిదిద్దిన అరుదైన గౌరవం రేవాలోని సైనిక్ స్కూల్‌కు దక్కుతుంది" అని అభినందించారు. 1964 జులై 1న జన్మించిన లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది 1984 డిసెంబర్ 15న సైన్యంలో చేరారు. అనంతరం వివిధ కీలక పోస్టుల్లో పనిచేశారు. నార్దర్న్ ఆర్మీ కమాండర్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించారు.

## ఒక్కరోజే దొరికిన 262 మంది మందుబాబులు

### హైదరాబాద్లో పెరుగుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు


ముందడుగు క్రైం: మద్యం సేవించి వాహనం నడపకూడదని తెలిసినా మందు బాబులు అవేమి పట్టించుకోవడం లేదు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు భారీ ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెరుగుతున్నాయి. 2024 జూన్ 29వ తేదీ శనివారం రాత్రి రాత్రి పెద్ద ఎత్తున డ్రంక్ డ్రైవింగ్ టెస్టులు నిర్వహించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో భారీ ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా.. 262 మంది పట్టుబడ్డారు. 191 బైకులు, 11 ఆటోలు, 56 కార్ల డ్రైవర్లను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో 12 మందికి బ్రీత్ ఎనలైజర్ లో 300



పైగా రీడింగ్ వచ్చింది. డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన వారందరి వెహికిల్స్ ను పోలీసులు సీజ్ చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నారు. కాగా బహిరంగంగా మద్యం తాగినా, తాగి వాహనాలు నడిపినా, మద్యం తాగి రోడ్లపై గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఎవరైనా మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి ప్రమాదాలు చేసి ప్రజలను చంపేస్తే, అలాంటి మందుబాబులపై సెక్షన్ 304 పార్ట్ II కింద అరెస్టు చేసి జైలుకు పంపుతామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి చెప్పారు. మందుబాబులకు గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్ష కూడా విధించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

## నా జీవితంలో అదే అతి పెద్ద విషాదం: నటుడు

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ షోరే హిందీ బిగ్‌బాస్ ఓటీటీ మూడో సీజన్‌లో పాల్గొన్నాడు. గతంలో పూజా భట్‌తో ప్రేమాయణం నడిపిన ఈయన తాజాగా బిగ్‌బాస్ హౌస్‌లో ఆనాటి సంగతులను గుర్తు చేసుకోవడంతో పాటు కెరీర్ ఎలా మొదలైందో వెల్లడించాడు. రణ్‌వీర్ మాట్లాడుతూ.. 21 ఏళ్ల వయసులో కెమెరా వెనకాల నా ప్రయాణం మొదలైంది. కొన్ని షోలకు డైరెక్షన్ చేశాను, నిర్మాతగా వ్యవహరించాను. తర్వాత ఓ ఎంటర్‌మైంట్ ఛానల్‌లో వీజేగా మారాను. ఆరంకెల జీతం అందుకున్నాను. సడన్‌గా మేనేజ్‌మెంట్ మారడంతో ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. మళ్లీ జీరో దగ్గరకు వచ్చాను. అప్పుడు నా సోదరుల దగ్గర అప్పు తీసుకునేవాడిని. 2002లో లధక్‌లో లక్ష్య షూటింగ్ చేస్తున్న సమయంలో అమ్మకు బాలేదని ఫోన్ వచ్చింది. షూటింగ్ కొనసాగుతూ ఉండటంతో అప్పటికప్పుడు వెళ్లలేకపోయాను. తర్వాత ముంబైకి



వెళ్లేసరికి అమ్మ ఆరోగ్యం కుదుటపడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. కానీ కొన్ని రోజులకే అమ్మ చనిపోయింది. అది నా జీవితంలోనే పెద్ద విషాదం. ఈ విషయాన్ని నా సోదరులకు ఫోన్‌లో చెప్పాల్సి రావడం మరో విషాదం. సరిగ్గా అదే సమయంలో ఓ నటి వల్ల అనేక ఆరోపణలు ఎదుర్కొన్నాను. నా పరిస్థితి చూసి మా అన్న అమెరికా వచ్చేయమన్నాడు. అలా అక్కడికెళ్లి తన దగ్గర అప్పు తీసుకుని ఆరు నెలలపాటు యాక్టింగ్ కోర్సు నేర్చుకున్నాను. ఇండియాకు వచ్చీరావడంతోనే అప్పటిదాకా అటకెక్కిన నా రెండు సినిమాలు (ఖోస్లా కా ఘోస్లా, ప్యార్ కి సైడ్ ఎఫెక్ట్స్ ) రిలీజ్‌కు నోచుకున్నాయి. జనాలు సైతం ఆ చిత్రాలను ఆదరించారు.

ముందడుగు
సోమవారం, 01-7-2024, హైదరాబాద్

# కారును నదిలోకి తీసుకెళ్లిన గూగుల్ మ్యాప్

## ఇద్దరు కొట్టుకపోగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు

ముందడుగు కేరళ:

చాలా మంది కొత్త ప్రాంతాలకు వెళితే రూట్‌మ్యాప్ కోసం గూగుల్ మ్యాప్స్‌ను వాడడం అందరికీ అలవాటుగా మారింది. అయితే, చాలా సందర్భాల్లో ఈ మ్యాప్స్‌లో అడ్రస్ సరిగ్గా చూపిస్తున్నా.. అప్పుడప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. పలువురు ప్రమాదాల బారినపడ్డ సందర్భాలు సైతం ఉన్నారు.



తాజాగా కేరళకు చెందిన యువకులకు సైతం ఇదే చేదు అనుభవం ఎదురైంది. కేరళ కాసర్‌గోడ్ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు ఆసుపత్రికి కర్నాటకలోని ఆసుపత్రికి బయలుదేరారు. రూట్‌మ్యాప్ కోసం గూగుల్ మ్యాప్స్‌ను ఉపయోగించారు. యువకులు ప్రయాణిస్తున్న కారు హఠాత్తుగా నదిలోకి దూసుకుపోయింది. నదిలో నీటి ఉధృతికి కారు కొట్టుకుపోగా.. ఇద్దరు యువకులు చెట్టును పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. అబ్దుల్ రషీద్‌తో పాటు మరో యువకుడు ఆదివారం వేకువ జామున పొరుగున ఉన్న కర్ణాటకలోని ఆసుపత్రికి వెళ్తున్నామని.. నావిగేషన్ కోసం గూగుల్ మ్యాప్స్‌ని ఉపయోగించగా ఈ దారుణం జరిగినట్లు తెలిపారు. ఫైర్‌ఫోర్స్ సిబ్బందిని సంఘటనా స్థలానికి చేరుకొని తమను కాపాడారని తెలిపాడు. ప్రాణాలతో బయటపడతామని అనుకోలేదని.. ఇది తమకు పునర్జన్మ అని తెలిపాడు.

# టీమిండియాకు బీసీసీఐ భారీ బహుమతి

## రూ.125 కోట్ల నగదు ఇస్తున్నట్లు వెల్లడి

ముందడుగు జాతీయం:

టీ20 వరల్డ్ కప్ సాధించిన భారత జట్టుకు బీసీసీఐ భారీ బహుమతిని ప్రకటించింది. రూ.125 కోట్ల నగదు బహుమతి ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జై షా ఎక్స్ (ట్విటర్)లో ప్రకటన చేశారు. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించి రెండోసారి పొట్టికప్‌ను సొంతం చేసుకుంది. 2013 తర్వాత టీమ్‌ఇండియా ఐసీసీ ట్రోఫీ నెగ్గడం ఇదే తొలిసారి. దీంతో పొట్టి కప్ నెగ్గిన భారత జట్టుకు బీసీసీఐ భారీ మొత్తాన్ని ప్రకటించింది. ''ఐసీసీ పురుషుల




టీ20 ప్రపంచ కప్ 2024ను గెలిచినందుకుగాను టీమ్‌ఇండియాకు రూ.125 కోట్ల నగదు బహుమతిని ప్రకటించినందుకు నేను సంతోషిస్తున్నాను. టోర్నమెంట్ ఆసాంతం జట్టు అసాధారణమైన ప్రతిభ, సంకల్పం, క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అద్భుతమైన విజయం సాధించిన ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి అభినందనలు'' అని జై షా ఎక్స్‌లో పోస్టు పెట్టాడు.



# భారత్‌లో చదువు కంటే పెళ్లిళ్లకే ఖర్చు ఎక్కువ

- ఏటా 80 లక్షల నుంచి కోటి పెళ్లిళ్లు
- తాహతుకు మించి ఖర్చు చేస్తున్న భారతీయులు

ముందడుగు జాతీయం:

భారతదేశంలో వివాహాలకు భారీగా ఖర్చు చేస్తున్నారు. దేశంలో సగటు భారతీయుల చదువుతో పోలిస్తే వివాహంపైనే రెండింతలు అధికంగా ఖర్చు చేస్తున్నట్లు ప్రముఖ బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ వెల్లడించింది. భారత వివాహ పరిశ్రమ పరిమాణం రూ.10 లక్షల కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేసింది. ఆహారం, నిత్యావసరాల తర్వాత స్థానం దీనిదేనని వెల్లడించింది.

### భారీగా ఖర్చు

భారత్‌లో ఏటా 80 లక్షల నుంచి కోటి వరకు పెళ్లిళ్లవుతున్నాయని నివేదిక అంచనా వేసింది. చైనాలో 70- 80 లక్షలు, అమెరికాలో 20- 25 లక్షలుగా ఉంటుందని తెలిపింది. అమెరికాతో పోలిస్తే భారత వివాహ పరిశ్రమ పరిమాణం రెండింతలు ఉంటుందని అంచనా వేసింది. ఒకవేళ వివాహాలను ప్రత్యేక రిటైల్ కేటగిరీగా వర్గీకరిస్తే.. ఆహారం, నిత్యావసరాల తర్వాత రెండో అతిపెద్ద విభాగంగా ఇదే ఉంటుందని పేర్కొంది.

### పెద్ద ఎత్తున కొనుగోళ్లు

భారత్‌లో వివాహాలు ఎంత ఆడంబరంగా చేస్తారో చెప్పాల్సిన అవసరం లేదు. కొన్ని రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో అట్టహాసంగా నిర్వహిస్తారు. పెద్ద ఎత్తున ఖర్చు చేస్తారు. దుస్తులు, ఆభరణాల వంటి పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తారు. పరోక్షంగా వాహన, ఎలక్ట్రానిక్స్ రంగంలోనూ గిరాకీ పుంజుకుంటుంది. పెళ్లిని ప్రతిష్ఠాత్మకంగా భావించే భారతీయులు తాహతుకు మించి ఖర్చు చేస్తారని నివేదిక వెల్లడించింది. భారత్‌లో సగటున ఒక పెళ్లిపై కనీసం రూ.12.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపింది. స్తోమతను బట్టి ఇది అంతకంతకూ పెరుగుతుందని పేర్కొంది. ఈ క్రమంలో ఒక్కో పెళ్లిపై చదువు కంటే రెండింతలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపింది. అదే అమెరికాలో విద్యపై చేసే వ్యయంతో పోలిస్తే వివాహంపై చేసే ఖర్చు సగమేనని వెల్లడించింది.

### అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు

అంతర్జాతీయ స్థాయి ఖరీదైన ప్రదేశాలు, అతిథులకు మర్యాదలు, పసందైన వంటకాలతో భారత వివాహాలు ఆడంబరంగా జరుగుతాయని జెఫరీస్ నివేదిక తెలిపింది. ఈ నేపథ్యంలో దుస్తులు, ఆభరణాలు, ఆతిథ్యం, క్యాటరింగ్, రవాణా వంటి రంగాల కార్యకలాపాలు పుంజుకుంటాయని పేర్కొంది. దేశంలో ఏటా నమోదయ్యే మొత్తం ఆభరణాల విక్రయాల్లో సగం పెళ్లిళ్ల కోసమే జరుగుతాయని తెలిపింది. దుస్తుల అమ్మకాల్లో 10 శాతం వివాహాల గురించేనని పేర్కొంది. పెళ్లికి 6-12 నెలల ముందు నుంచే ఏర్పాట్లు ప్రారంభమవుతాయని, గరిష్ఠంగా 50 వేల మంది వరకు అతిథులు హాజరవుతుంటారు. వివాహ సమయంలో నానా హంగామా సృష్టించడంలో భారతీయుల తర్వాతే మరెవరైనా అని తెలుస్తోంది.

ముందడుగు
సోమవారం, 01-7-2024, హైదరాబాద్



క్లాస్ రూంలో తోటి విద్యార్థిని కత్తితో పొడిచిన

# 9వ తరగతి విద్యార్థి

ముందడుగు ఒడిశా: ఒక తరగతికి చెందిన విద్యార్థి తన తోటి విద్యార్థిని తరగతి గదిలో కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కత్తితో పొడిచిన 9వ తరగతి స్టూడెంట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం రాంచంద్రాపూర్‌లోని రఘునాథ్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో తోటి విద్యార్థిని ఒక స్టూడెంట్ కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని ఎంకేసీజీ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. తోటి విద్యార్థిని కత్తితో పొడిచిన 14 ఏళ్ల స్టూడెంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్కూల్ బ్యాగ్‌లో కత్తి కలిగిన విద్యార్థి క్లాస్‌లో టీచర్ లేనప్పుడు తన క్లాస్‌మేట్‌పై దాడి చేశాడని పోలీసులు తెలిపారు. బాధిత విద్యార్థి ఆకస్మికంగా రెచ్చగొట్టడం వల్ల ఈ సంఘటన జరిగినట్లు చెప్పారు.

# ముగ్గురు కస్టమ్స్ అధికారులపై సీబీఐ కేసు

## శంషాబాద్ విమానాశ్రయంలో ఘటన

ముందడుగు హైదరాబాద్: ముగ్గురు కస్టమ్స్ అధికారులపై సీబీఐ అధికారులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఈ అధికారులపై విదేశీ కరెన్సీని అక్రమంగా రవాణా చేసేందుకు సహకరించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో నిజాంపేటకు చెందిన ఏ శ్రీనివాసులు, ఓల్డ్ బోయినపల్లికి చెందిన పంకజ్ గౌతమ్, కానాజీగూడకు చెందిన పేరి చక్రపాణిపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు. గతేడాది మార్చి 16న శంషాబాద్ విమానాశ్రయంలో విదేశీ, భారత కరెన్సీని సీఐఎస్ఎఫ్, సీఐడబ్ల్యూ సిబ్బంది పట్టుకున్నారు. రూ.4లక్షల భారత కరెన్సీని తీసుకెళ్తున్న నగరంలోని బహదూర్‌పురాకు




చెందిన ప్రైవేటు వ్యక్తితో పాటు అతడి కుమారి వద్ద రూ.2,93,425కి సమానమైన వివిధ దేశాల కరెన్సీని నోట్లు ఉన్నాయంటూ సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మూడు, ఢిల్లీలో ఓ చోట నిందితులకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాల్లో సీబీఐ అధికారులు సోదాలు జరిపి కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని అధికార వర్గాలు తెలిపాయి.





# బాలికకు భరోసా కావాలి

- మహిళల్లో నిత్యం అవగాహన పెరగాలి
- మనిషికి బంధాల విలువ తెలియాలి
- బాలికలకు ఆర్థిక ప్రోత్సాహం కావాలి
- ముందడుగుతో వాణి చెప్పిన ముచ్చట్లు



**సమాజం వేగంగా పరుగులు పెడుతోంది.. ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో తెలుస్తోంది.. టెక్నాలజీ వేగంగా రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతోంది.. ఇది చూస్తున్న మనం అభివృద్ధిలోకి దూసుకుపోతున్నామని అనుకుంటున్నాం.. కాని అదే టెక్నాలజీ మాటున విలువలు కనుమరుగవుతున్నాయి.. భార్యభర్తల బంధాలకు బీటలు బారుతున్నాయి.. కన్న కూతురు, కొడుకులే తల్లిదండ్రులను నడిరోడ్డుపై వదిలేస్తున్నారు.. వీరందరికి బంధాల విలువ, బాధ్యతల విలువ తెలియాలి.. వీటితో పాటు మహిళలు ఆర్థికంగా ఎదగాలి అనే భరోసా కావాలి.. తమ ప్రాంతంలో ఆ ఆలోచనతోనే కల్పిస్తూ ముందకు నడుస్తోంది వాణి.. వారు చేస్తున్న కార్యక్రమాలపై వాణి ముందడుగుతో ముచ్చటించింది.**

ముందడుగు ప్రత్యేకం

అందరూ ఎదగాలి.. అందరూ అన్ని రంగాల్లో రాణించాలి.. మనిషి ఎదుగుదలకు చేయూత ఇవ్వాలి.. ఈ మాటలు వినడానికి, చెప్పడానికి చాలా బాగున్నాయి.. కాని ఆ మాటలు పాటించేవారు, అమలు పరిచేవారు మాత్రం కనబడరు.. ఎందుకంటే ఒక మనిషికి సహకారం, సహాయం అందించే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. ఎవరికి వారు, యమునా తీరుగా ఆలోచిస్తే ఈ సమాజం ఏం కావాలి. అందుకే తమ వంతు ప్రయత్నంగా పలు కార్యక్రమాలు చేస్తున్నాను.

### మహిళలకు ఆర్థిక భద్రత

ప్రతి మహిళ ఎవరిపై ఆధారపడకుండా ఎంతో, కొంత ఆర్థికంగా ఎదగాలి.. అప్పుడే స్వతంత్ర భావాలు అలవాటుపడుతాయి. 2006లో మహిళ సంఘంలో సభ్యురాలుగా ఆవిడ ప్రస్థానం మొదలెట్టాను. మహిళలను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి పొదుపు చేస్తే వచ్చే లాభాలపై అవగాహన కల్గించాను. గ్రామ సంఘం లీడర్ గా, మహిళ సమాఖ్య నాయకురాలిగా పనిచేశాను. మహిళలకు సమస్యలు ఉంటే మహిళ సంఘం దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేశాను. మహిళలకు సమాజంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఆర్థిక భరోసా ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

### బాలికలకు భరోసాగా..

ఒక స్వచ్ఛంధ సంస్థలో పనిచేస్తున్నప్పుడు చదువుకు దూరమైన ఎంతోమంది పిల్లలను దగ్గరుండీ పాఠశాలలో చేర్పించాను. చిన్న చిన్న కారణాల వల్ల భార్యభర్తలు గొడవ పడితే కౌన్సిలింగ్ చేసి జీవితం అంటే ఏంటో వివరిస్తూ వారు సంతోషంగా జీవించే ప్రయత్నం చేశాను. ఒక అమ్మాయిని ఒక అబ్బాయి గర్భవతిని చేసి మోసం చేస్తే అబ్బాయి ఇంటి ముందు ధర్నా చేసి అబ్బాయికి శిక్ష పడేలా చేశాను. చివరికి వారి ఇద్దరికి కౌన్సిలింగ్ చేసి పెళ్లి జరిపించాము. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి.




### బంధాల విలువపై అవగాహన

మతిస్థిమితం లేకుండా రోడ్ల వెంబడి తిరుగుతున్న మహిళలను తీసుకొచ్చి ఆసుపత్రి చికిత్స చేపించి, రాష్ట్రంకాని రాష్ట్రంలో వారి స్వంత గ్రామాలకు తీసుకెళ్లి వదిలిపెట్టిన సంధర్భాలు ఉన్నాయి. ఓ కూతురు తన తల్లిని తీసుకొచ్చి నడిరోడ్డు మీద వదిలెస్తే కూతురిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లి గొప్పదనంపై వివరిస్తూ కూతురికి తల్లిని అప్పజెప్పాను. లంబాడీ తండాలలో అమ్మాయిల చదువును ప్రోత్సాహం ఇస్తూ, ఆర్థికంగా సహకారం చేసిన సంధర్బాలు ఉన్నాయి.. 2023 నుంచి బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాలలో ఆడపిల్లలకు సంబంధించిన చైల్డ్ మ్యారేజ్ చెయొద్దు. ఆడపిల్లలు చదివించాలనే కార్యక్రమాలు నిత్యం చేస్తున్నాను.

### వనితావాణి ఆసరాగా నిలవాలి

స్వంతంగా ఒక సంస్థను ఏర్పాటు చేశాను. కాని ఇంకా పూర్తి స్థాయిలో కార్యక్రమాలు మొదలెట్టలేదు. అమ్మాయి లకు, మహిళలకు ఏ సమయంలో, ఏలాంటి సమస్యలు ఉన్న ముందుగా వారికి భద్రత కల్పించాలి. కుటుంబంలో ఎవ్వరూ లేని వారి కోసం అది పిల్లలైనా, పెద్దలైనా వారికి ఒక గూడు ఏర్పాటు చేయాలి.. వారికి తోడుగా ఉండాలి.. అందుకే ఒక ఆశ్రమం ఏర్పాటు చేసే పనిలో ఉన్నాను. కుటుంబం సభ్యులు ఉన్న ఏ ఒక్కరూ రోడ్డు మీద ఉండొద్దు. సాధ్యమైనంత మేరకు ప్రతి మనిషికి బంధాల విలువ తెలిపే ప్రయత్నం చేయాలి. ప్రతి బాలిక చదువు కొవాలి. ప్రతి మహిళ తన స్వంత భర్తపై కూడా ఆధార పడకుండా ఆర్థికంగా ఎదగాలి.. ఇలా ఎన్నో వినూత్న కార్యక్రమాలతో తన సంస్థ పూర్తి స్థాయిలో ముందుకు సాగనుందని వాణి అంటున్నారు.. వాణి చేస్తున్న, చేయ బోయే కార్యక్రమాలకు ముందడుగు నుంచి ముందుగా హ్యాట్సాఫ్.

ముందడుగు
సోమవారం, 01-7-2024, హైదరాబాద్



# ఆయన నుంచి చాలా నేర్చుకున్నా: రకుల్ ప్రీత్ సింగ్

హీరో యిన్ రకుల్‌ప్రీత్ సింగ్ ది చిత్ర పరిశ్రమలో దాదాపు పదిహేనేళ్ల ప్రయాణం. 2009లో 'జిల్లీ' అనే కన్నడ సినిమాతో కథానాయికగా పరిచయమయ్యారు ఈ బ్యూటీ. ఆ తర్వాత తెలుగు, తమిళ్, హిందీ సినిమాలు చేసి స్టార్ హీరోయిన్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. తాజాగా రకుల్‌ప్రీత్ నటించిన చిత్రం 'భారతీయుడు 2'. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన 'భారతీయుడు 2' మూవీలో కీలక పాత్ర పోషించారామె. ఈ నెల 12న ఈ మూవీ పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అవుతోంది.

కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ– "భారతీయుడు 2' సినిమాలో నటించడం గౌరవంగా భావిస్తున్నా. ఈ చిత్రం కోసం విలక్షణ నటులు కమల్ హాసన్ సర్‌తో, గొప్ప దర్శకుడైన శంకర్ సర్‌తో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. షూటింగ్ సమయంలో శంకర్ సర్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ఆయన ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు. తెరపై కథలని, పాత్రలను ఆయన చూపించే విధానం అద్భుతం.

శంకర్‌సర్ ఆలోచనా విధానం, సృజనాత్మకత గురించి ఎంత చెప్పినా తక్కువే" అన్నారు. ఇదిలా ఉంటే.. రకుల్ ప్రస్తుతం హిందీలో 'మేరీ పత్నీకా రీమేక్' వంటి సినిమాల్లో నటిస్తున్నారు. కాగా నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ వివాహం ఈ ఫిబ్రవరి 21న జరిగిన విషయం తెలిసిందే. అటు వ్యక్తిగత జీవితం, ఇటు సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు రకుల్‌ప్రీత్.



## ట్రెండింగ్‌లో తృప్తి డిమ్రి
# బ్యాడ్ న్యూజ్

యానిమల్ సినిమాతో తృప్తి డిమ్రి యూత్ ఫేవరెట్ క్రష్ అయిపోయింది. తన అందంతో కుర్రకారును కట్టిపడేసిన ఈ బ్యూటీకి భారీగానే ఫ్యాన్స్ ఉన్నారు. ఈ ఒక్క సినిమాతో తన జీవితమే మారిపోయిందని చెప్పవచ్చు. యానిమల్ సినిమా వల్ల అవకాశాలు క్యూ కట్టేశాయ్. దీంతో ముంబైలో కొత్తిల్లు కూడా కొనుగోలు చేసింది. ఇప్పుడు ఆమె నుంచి ఏ సినిమా వచ్చినా భారీ కలెక్షన్స్ రావడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. ఈ క్రమంలో విక్కీ కౌశల్‌కు జంటగా ఆమె నటించిన 'బ్యాడ్ న్యూజ్' చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అమీ విర్క్ ఇందులో మరో ప్రధాన పాత్రలో నటించాడు. వాస్తవిక సంఘటనల ఆధారంగా రానున్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌ని ఆనంద్ తివారీ తెరకెక్కిస్తున్నారు. ధర్మా ప్రొడక్షన్స్, లియో మీడియా కలక్టివ్ సంయుక్తంగా 'బ్యాడ్ న్యూజ్' చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతుంది. ట్రైలర్ విడుదలైన 24 గంటల్లోనే 3 మిలియన్ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. జులై 19న సినిమా విడుదల కానుంది.